కవితా కౌముది

# ఎంత బాగుంటుందీ..!

అన్నంరాజు వేణుగోపాలశ్రీనివాసమూర్తి

మౌనం ఎంత అందమైన అనుభూతి...
అంతరంగంలోకి వెళ్ళి చూసుకుంటుంటే
అదృశ్య అగోచర ఆనందాలెన్నెన్నో తీయగా
స్పృశిస్తాయి.......
వృధా చేసుకున్న
క్షణాలు...నిముషాలు...గంటలు...
రోజులెన్ని రాలిపోయాయో నిస్సార
నిస్తేజంగా...
అప్రస్తుత ప్రసంగాలతో
ఆడంబర అట్టహాసాలతో
వృధాభరిత తలపులతో
శూన్యహృదయ బంధాలతో...
ఏదో ఉందనుకొని ఏమీ లేదని
తేల్చుకొన్న శబ్దప్రపంచంలోంచి
బయటకొచ్చి మనల్ని మనం
అవలోకించుకుంటుంటే నిజంగానే ఎంత
బాగుంటుంది...

ఎగిరెగిరిపడే అలలు లేని సంద్రంలా
మనసును నియంత్రించుకుంటే
ఎంత హాయిగా ఉంటుంది...
ఏ ముద్రలు ఏ ఆశలు కోరికలూ
లేకుండా ఏకాంతవాసంలో
నిన్ను నువ్వు అవగాహన చేసుకుంటూ
నీలో నువ్వుహృదయకుహరంలో
ధ్యానించుకుంటూంటే
సహజంగానే ఎంత శాంత
ప్రశాంతంగా ఉంటుంది!!
విశ్వదివ్యశక్తిని నీకు నీవై
నీలోకి తెచ్చుకుంటూంటే
నిఖిలలోకం స్వప్నసదృశమై
నీ నుండి నిర్లిప్తంగా సుదూరమై  అదృక్కై
అకారణమై పోతూంటే
అవిద్య అంతమై శూన్య పరమాకాశ
విశుద్ధస్వరూపమై
భాసిల్లుతూంటే అదే వాస్తవమై
యధార్థమై ఎంత బాగుంటుంది!!

★★★

# అబ్బే..!

## శ్రీనివాస్ బందా

అబ్బే, పెద్ద అప్పేం కాదు
మహా అయితే ఓ తొమ్మిదివేలు..
కోట్లే అనుకో..
పెద్ద గొడవేం లేదు – ఓ పడవ మునగడం తప్ప..
ఎగిరే పడవలే అనుకో..
అయినా ఇవన్నీ మామూలేగా!
ఎగరడం మునగడం ఎగేయడం
నేనేం మొదటివాణ్ని కాదుగా..

అక్కడికి ఇచ్చేస్తానన్నాగా..
ఏదో కాస్త చల్లగాలికలా పక్కూరికెళ్లేనే అనుకో..
మొసలిలా హెయిర్‌కట్ చేయించుకున్నానే
అనుకో..
చెరోపక్కా పట్టుకుందుకిద్దరిని పెట్టుకున్నానే
అనుకో..
మీదేంబోయె? ఎవడిదేంబోయె?
బహుశా బయల్దేరాలేమో, ఇప్పుడీ ఇంట్లోనూ పొగ
ముదుర్తోంది
తీరిగ్గా కందామనుకున్న కల చెదుర్తోంది

ఇంతకీ కొత్తిల్లు బాగుంటుందోలేదో
దోమలు కుడతాయేమో కోరలు పదునెక్కించుకుని
రాతిదిమ్మలు పలకరిస్తాయేమో
కాస్త చూడండి మరి
ఎంతైనా వేలకోట్లు తిన్నవాణ్ని
కాస్త భుక్తాయాసముండదూ..

అసలూ, అనుభవించడం తెలిసినవాణ్ని
అంతకంటే ముందు సంపాయించడమెరిగినవాణ్ని
గొంతులు తడపమని వచ్చిందే మీరు కాదూ?
మీ జేబులు నింపలేదా పక్కన కూర్చోలేదా?
నిరాశపడుతున్నా పక్కింటాయన తీర్పుకి
ఆశ పడడం ఆశపెట్టడం తప్పౌతుందా ఎక్కడైనా?
ఆశే ఆకర్షణ మీకూ నాకూ
నాకందిన కాయలు నే తుంచుకున్నా
చెట్టు మీ ఒక్కళ్లదీ కాదుగా..

చూద్దాంలే..
బూట్ల జతలింకా ఉన్నాయి అరగడానికి
జత్తూ ఉంది పీకి మీకివ్వడానికి
మూడడుగులు ముందే ఉన్నాను
నాలుగాకులెక్కువే చదివాను
అయిదారేళ్లు సాగదీస్తాను
ఏడ్చినంత ఏడ్వనిస్తాను

మీ ఇరుకు గదుల్లోకి
మురికి కూపాల్లోకి అడుగెట్టనంటా
కత్తిరించలేనన్ని రెక్కలతో
అటూ ఇటూ జారుతోనే ఉంటా..

★★★

## వేగుచుక్క
### చందలూరి నారాయణ రావు

వెన్నెల వానలో
మనిషి ఎంత తడిసినా
చిత్తడి చిత్తడిగా చీకటి
మనసంతా కటిక నలుపు

మెదడులో పాతిపెట్టిన
పాతకాలం నాటి ఆలోచన
పేడుముక్కలా పదునుగా గుచ్చుకొంది.

మనసు ముంగిట కాలి ముద్రలో
చెక్కుచెదరని భావముద్రలో
మౌనముద్రలో పలుకరించావు
మూగరాగమై వినిపించావు.

బొట్లు బొట్లుగా కలలు కలిగి
కాలువలుగా జీవితాన్ని ముంచి
హృదయంలో బాధమట్టం పెరిగి
బతుకు తీరం కోతకు గురి.

ముసురు మోములో
ముడుచుకున్న వెలుగు నవ్వుకు
చమురు పోసే చెలిమి చేతిని
రాత్రి మోసిన తలపు తాకి
"వేగుచుక్క"లా మళ్ళీ మొలిచావు.

★★★

## జీవితంలో..
### మూలా వీరేశ్వరరావు

విశేషాలు ఉండవు !

అది ఎప్పుడూ  సశేషము !

పురాతన దుఃఖ అవశేషం

సగం స్వప్నం లో లేచిన వేకువ !

తృష్ణ మృగతృష్ణ యే

కళలన్నీ కంకాళాల కి

కలంకారీ పూత లే !

స్వార్థపు రోతలే !

అర్థం కోసం అన్వేషణ

వ్యర్థమైన తండ్లాట !

జీవితం,మృత్యువు

నిత్యం

దోబూచులాట

జీవించడమే

రిఫరీ లేని  ఒక

పెద్ద ఆట !

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

మండువేసవి యెల్లెడ నిండిపోయె
వెన్నెలలవంటి నగవుల విరిసినట్టి
విరులవన్నియు సలిపెట్టి యరుగుచుండె
వచ్చు వత్సరము మరల వత్తుమంచు

విరులతో పాటు పల్కెను వీడుకోలు
భసలశుకపికబహుపరివారమెల్ల
మరల వచ్చెదమంచును మాట యిచ్చి
గడపుటెట్లు కాలము చెలికాండ్ర కొరకు

వెడలిపోయిన గాని నా యెడద యందు
చల్లుననురాగవర్షముల్ సౌరభములు
కరగిపోవక ముందె యా పరిమళములు
నా మదిని నిండెననుపమానందధార

ఎంత ప్రచురమైనను గాని యెండ వేడి
మనసు మధురోహలను ముల్లి తనియుచుండె
చాలు నీ మృదుశీతలస్పర్శ యొకటె
తరలునెంతటి భయదనిదాఘమైన

ఎన్ని క్లేశముల్ నన్ను పైకొన్న గాని
చెదరునవియెల్లననురాగసిద్ధి యందు
వచ్చి నా యింట చేరి నీ వలపు పలుకు
తెమ్మెరల తీర్చుమీ మహోద్దీపనమ్ము

COMMENTS